సాక్షి కర్నూలు

శనివారం ¦ 11 ¦ జనవరి ¦ 2025



నృత్య పోటీలు ప్రారంభం

నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. IIలో ▸



మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మహానందిలో శ్రీగంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,623.94
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 73.071
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 0
అవుట్ ఫ్లో	: 9,392

న్యూస్‌రీల్

వెదురు సాగుకు రాయితీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో వెదురు సాగుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెదురు సాగును ప్రోత్సహించింది. 2023–24లో వెదురు సాగుకు రాయితీలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ప్రతిపాదనలకు ఆమోదం లభించ లేదు. నేషనల్ బ్యాంబు మిషన్ ద్వారా వెదురు సాగులో రాణించే రైతులకు రాయితీలు ఇస్తారు. 2023–24లో వెదురు సాగు చేపట్టిన రైతులకు కూడ రాయితీలు ఇచ్చేందుకు ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి కర్నూలు జిల్లాలో 10 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 10 హెక్టార్లకు రాయితీ ఇస్తోంది. హెక్టారుకు యూనిట్ కాస్ట్ రూ.లక్ష ఉంది. ప్రభుత్వ సంస్థలు అంటే గ్రామ పంచాయతీలు వెదురు సాగు చేపడితే వంద శాతం సబ్సిడీ, ప్రైవేటు సంస్థలు, రైతులు సాగు చేస్తే 50 శాతం రాయితీ లభిస్తోంది. అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తే హెక్టారుకు 1,500, బార్డర్‌గా నాటుకుంటే 427 మొక్కలు వస్తాయి. ఉత్పత్తి అయ్యే వెదురును నేషనల్ బ్యాంబు మిషన్ సేకరించనుంది. రాయితీని మూడేళ్లలో చెల్లిస్తుంది. మొదటి ఏడాది 50 శాతం, రెండవ ఏడాది 30 శాతం, 3వ ఏడాది 20 శాతం సబ్సిడీ లభిస్తుందని అధికారులు తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

కర్నూలు సిటీ: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు 104 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. శుక్రవారం జిల్లాకు హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, తిరుపతి నుంచి 43 బస్సులు, శనివారం హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, తిరుపతి, చెన్నై, నెల్లూరు నుంచి 37 బస్సులు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఆదివారం హైదరాబాదు నుంచి 13, బెంగళూరు 06, తిరుపతి 01, విజయవాడ 01 బస్సుల ద్వారా జిల్లా కేంద్రానికి ప్రయాణికులు రానున్నారు. అయితే కర్నూలుకు చేరుకునే ప్రయాణికులు తమ గ్రామాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

వయోజన విద్య ఉల్లాస్‌పై శిక్షణ

కర్నూలు సిటీ: ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జెడ్పీలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని 9 మండలాలకు చెందిన ఎంపీడీఓ, ఏపీఎంలకు ఒక రోజు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వయోజన విద్యా డీడీ కె.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని 9 మండలాల్లో 28,842 మంది నిరక్షరాస్యులైన మహిళలకు చదువు చెప్పేందుకు వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. మండల స్థాయిలో వలంటీర్‌లకు శిక్షణ ఇవ్వడంలో జాప్యం చేయొద్దని ఎంపీడీఓ, ఏపీఎంలను సూచించారు. కార్యక్రమంలో వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓలు, ఏపీఎం, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీలో ఎన్నికల సైరన్

- మూడు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికల షెడ్యూల్
- ఏకగ్రీవం కాకుంటే 27న పోలింగ్

ఆళ్లగడ్డ: కర్నూలు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్ (విజయడెయిరీ)లో డైరెక్టర్ల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల అధికారి హరిబాబు శుక్రవారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 15 డైరెక్టర్ల స్థానాలు ఉన్నాయి. ఇందులో ఇటీవల మూడు డైరెక్టర్ల పదవీకాలం పూర్తైంది. దీంతో ఖాళీ అయిన ఈ స్థానాలకు ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నంద్యాలలోని విజయ డెయిరీ ఎండీ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల తరువాత పరిశీలన, 18వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు ఉపసంహరణ గడువు విధించారు. అదేరోజు ఫైనల్ అభ్యర్థుల జాబితా కూడా ప్రకటిస్తారు. ఒకవేళ పోటీలో ఎవరూ లేకుంటే ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడిస్తారు. పోటీ అనివార్యమైతే 27న నంద్యాల పాల డెయిరీలో మధ్యాహ్నం 2 గంటల వరకు రహస్య ఓటింగ్ విధానంలో ఎన్నిక నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు ముగిసిన వెంటనే గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తారు.

మరో ఏడాది వరకు చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డినే

ప్రస్తుతం విజయడెయిరీ చైర్మన్‌గా ఉన్న ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ కాలం మరో ఏడాది పొడిగిస్తూ డైరెక్టర్లు తీర్మానం చేశారు. ఆర్.సి.నెం 28/లీగల్ 2021 ఉత్తర్వుల మేరకు సమితి నిబంధన 29(2)నకు సవరణ చేసి అధ్యక్షుడి కాలపరిమితి నిబంధన 23(1)లో సూచించిన విధంగా తన కార్యవర్గ సభ్యుల పదవీకాలం ముగిసేవరకు పొడిగించి రిజిస్టర్ చేయడంతో అధ్యక్ష పదవికి ప్రత్యేకంగా ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి 2026 జనవరి 31 వరకు ఆ పదవిలో కొనసాగుతారని అధికారులు తెలిపారు.

వేలం.. దారుణం

- రైతులకు దూరమవుతున్న కేడీసీసీబీ
- కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అధ్వానం
- రూ.5 కోట్లు కూడా రుణాలు పంపిణీ చేయలేని వైనం
- వ్యవసాయం కలసి రాక నష్టాల్లో మునిగి తేలుతున్న రైతులు
- డిసెంబరు వరకు 1,457 మంది రైతులకు సెక్షన్ 71 కింద నోటీసులు
- తదనంతరం 522 మంది అన్నదాతలకు ఈపీలు దాఖలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు వ్యవసాయం కలసి రాలేదు. వేరుశనగ, పత్తి, కంది, మొక్కజొన్న.. ఇలా అన్ని రకాల పంటలు సరిగ్గా పండలేదు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు కూడా అందలేదు. నష్టాలు మూట గట్టుకుంటున్న రైతులపై ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు దారుణంగా వ్యవహరిస్తోంది. రుణాల వసూళ్లకు అన్నదాతల ఆస్తుల విక్రయం కోసం రంగం సిద్ధం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రధాన కార్యాలయం

గతేడాది నోటీసులు, ఈపీ అందుకున్న రైతుల వివరాలు..

నెల	నోటీసులు అందుకున్న వారు	ఈపీ అందుకున్న వారు
జూన్	80	18
జూలై	218	49
ఆగస్టు	419	194
సెప్టెంబరు	125	37
అక్టోబరు	235	34
నవంబరు	132	165
డిసెంబరులో	248	25

- కేడీసీసీబీ గడువు ఇచ్చిన తేదీలోపు అప్పు చెల్లించకపోతే ఆస్తులు వేలం వేస్తామన్నది ఈపీ సారాంశం.

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాతలకు అవసరమైన రుణాలు పంపిణీ చేయకుండా అందుకు విరుద్ధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) వ్యవహరిస్తోంది. రైతుల ఆస్తులను విక్రయించి పాత బకాయిలకు జమ చేసుకునేందుకు లీగ్ యాక్షన్ మొదలు పెట్టింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కేడీసీసీబీ లాభాల బాట పట్టింది. బలమైన బ్యాంకుగా గుర్తింపు పొందింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడు నెలలకే బలహీనమైన బ్యాంకుల జాబితాలో చేరిపోతోంది. బ్యాంకు అభివృద్ధికి, రైతులకు సేవలకు నిరంతరం శ్రమించాల్సిన బ్యాంకు సిబ్బంది కొందరు బాధ్యతలను మరిచారు. అధికారులపై బూతులతో పిటిషన్‌లు పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

పనితీరు ఇలా..

రుణాల పంపిణీ కోసం బ్రాంచీలకు, పీఏసీఎస్‌లకు కేడీసీసీబీ రూ.330 కోట్ల బడ్జెట్ ఇచ్చింది. ఈ బడ్జెట్ 2024–25 ఆర్థిక సంవత్సరంలో పూర్తయితే అదనంగా ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉంది. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాల పంపిణీకి ఈ బడ్జెట్‌ని వినియోగించాలి. ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు(ఆప్కాబ్) కూడా రుణాల పంపిణీపై దృష్టి సారించి బడ్జెట్‌ను నాలుగైదు నెలల క్రితమే ఇచ్చింది. బడ్జెట్ దండిగా ఉన్నప్పటికీ రుణాల పంపిణీ మాత్రం తూతూమాత్రమే. డీసీసీబీ, పీఏసీఎస్‌ల్లో 700 మందికిపైగా ఉద్యోగులు ఉన్నా రుణాలు ఇచ్చింది రూ.5 కోట్ల మాత్రమే. అంటే ఒక్కొక్కరు రూ.లక్ష కూడా రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు పొందాలంటే రైతులు కమీషన్లు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రుణాలు ఇచ్చేందుకు పరిశీలన కోసం వెళ్లిన కొందరు అధికారులకు కూడా ముడుపులు ఇచ్చుకోవాల్సిందే. దీంతో రూ.లక్ష రుణం తీసుకుంటే చేతికి వస్తున్నది రూ.80,000 మాత్రమేనని రైతులు వాపోతున్నారు. అసలుకు వడ్డీ, చక్రవడ్డీ, అపరాధ వడ్డీ వేస్తున్నారని, ఎలా చెల్లించాలని రైతులు ప్రశ్నిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ముందుగా నోటీసులు తర్వాత ఈపీలు

రుణాల కోసం తాకట్టు పెట్టిన ఆస్తులను వేలం పాట ద్వారా విక్రయించేప్రక్రియను జిల్లా సహకార కేంద్రబ్యాంకు, పీఏసీఎస్‌లు ముమ్మరం చేశాయి. రుణాల పంపిణీలో చేతులెత్తేసిన పీఏసీఎస్‌లు కూటమి ప్రభుత్వంలో ఆస్తుల విక్రయానికి ఉత్సాహం ప్రదర్శిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఒకవైపు సెక్షన్ 71 కింద నోటీసులు ఇవ్వడం, మరోవైపు ఎగ్జిక్యూటివ్ పిటిషన్(ఈపీ) ఫైల్ చేయడం వంటివి ముమ్మరంగా జరుగుతున్నాయి. 2024 జూన్‌నుంచి డిసెంబరు నెల వరకు రూ.122.82 కోట్ల బకాయిలను రాబట్టుకునేందుకు 1,457 మంది రైతులకు సహకార చట్టం సెక్షన్ –71 కింద నోటీసులు ఇచ్చారు. ఇదే సమయంలో 522 మంది రైతుల నుంచి రూ.41.92 కోట్లను రాబట్టేందుకు ఈపీలు కూడా దాఖలు చేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

దశాబ్దాల కాలం నుంచి నష్టాలతో నడుస్తున్న కేడీసీసీబీకి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊపిరిపోసింది. కస్టమ్స్ హయ్యరింగ్ సెంటర్లు, మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలకు కేడీసీసీబీ రుణాలు అందచేసింది. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా నష్టాలను అధిగమించి నికర లాభాల్లోకి వచ్చింది. 2022–23, 2023–24 సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో రూ.10 కోట్లు లాభం ఆర్జించగా.. సభ్యులైన పీఏసీఎస్‌లకు రూ.4 కోట్లు డివిడెంట్ ఇచ్చింది. రాయలసీమ జిల్లాల్లోనే అత్యధిక టర్నోవర్ కలిగిన బ్యాంకుగా కేడీసీసీబీ వరుసగా రెండేళ్ల అవార్డు కూడా అందుకుంది. నికర లాభాల్లోకి వచ్చిన బ్యాంకు మళ్లీ నష్టాల్లోకి వచ్చి బలహీనమైన దిగా రికార్డు నమోదు చేసుకోవడం ఆందోళన కలిగించే విషయం.

రైతుల ఆస్తులు ఎందుకు వేలం వేయడం లేదు!

- రుణాలు చెల్లించే సామర్థ్యం ఉండీ కూడా అప్పులు చెల్లించకపోతే అస్తుల విక్రయానికి ఆదేశాలు

మొండి బకాయిలను రాబట్టుకునేందుకు రైతులు తాకట్టు పెట్టిన ఆస్తులను విక్రయించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, జిల్లా సహకార కేంద్రబ్యాంకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీ బి.నవ్య ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నెల 9న జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆస్తుల వేలంపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ అయిన జేసీ నుంచే ఆస్తుల వేలానికి ఆదేశాలు ఇవ్వడంతో డీసీసీబీ, పీఏసీఎస్‌లు ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు ముమ్మరం చేశాయి. 2024–25లో లోనింగ్ లేకపోవడం, నిరర్థక ఆస్తులు కొండలాగా పేరుకపోవడాన్ని గమనించిన జేసీ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తీసుకున్న రుణాలు చెల్లించే అవకాశం ఉండీ కూడా మొండికేసిన వారి ఆస్తులను వేలం వేసేందుకు వెనుకాడ వద్దని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినట్లు డీసీసీబీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతుండటం, గతంలో ఎపుడూ లేని విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో లోనింగ్ లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. 2023–24 వరకు లభాల బాట పట్టిన డీసీసీబీ ఆ తర్వాత రెగ్యులర్ సీఈవో లేకపోవడం, ఎఫ్ఏసీతో సీఈవో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి బ్యాంకు బాగోగులు పట్టించుకోకపోవడంతో మళ్లీ పీకల్లోతు నష్టాల్లోకి చేరుకుంటుంది.



కర్నూలు వెంకటరమణ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బారులుదీరిన భక్తులు

ముక్కోటి.. భక్తకోటి ప్రణమిల్లి

ముక్కోటి ఏకాదశి పర్వదినాన భక్తకోటి పరవశించింది. శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయాలను సర్వాంగ సుందర్శంగా అలంకరించారు. ఉత్తర ద్వార దర్శనంతో భక్తులు తరించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు బారులుతీరారు. పూజల్లో పాల్గొని స్వామి వారిని కనులారా దర్శించుకున్నారు. శ్రీగిరి క్షేత్రంలో రావణవాహనంపై కొలువైన భ్రామరీ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అహోబిలం క్షేత్రంలో ప్రహ్లాదవరదస్వామి గరుడ వాహనంపై విహరించారు. ఆర్ఎస్ రంగాపురంలోని వైష్ణవ క్షేత్రంలో శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహాస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది.

– కర్నూలు(కల్చరల్)



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి

విద్యుత్ చార్జీలు తగ్గించాల్సిందే

- ఏపీఈఆర్‌సీ భవన్ ఎదుట వామపక్షాలు ఆందోళన



ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ: కూటమి సర్కారు పెంచిన విద్యుత్‌చార్జీలను వెంటనే తగ్గించాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని వామపక్ష పార్టీలు హెచ్చరించాయి. శుక్రవారం కర్నూలులోని ఏపీఆఈఆర్‌సీ భవన్ ఎదుట సీపీఐ, సీపీఎం, సీపీఐ న్యూడెమోక్రసి నాయకులు వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని, ఉన్న వాటినే తగ్గిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే రెండు సార్లు చార్జీలు పెంచి ప్రజలపై భారం వేశారన్నారు. నమ్మించి మోసం చేసిన సర్కారుకు భవిష్యత్తులో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. విద్యుత్ బిల్లులు పెంపు(ఎఫ్.పీపీసీఏ)పై చేపడుతున్న అభిప్రాయ సేకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం ఆయా పార్టీల నాయకులు ఏపీఈఆర్‌సీ ఇన్‌చార్జ్ చైర్మన్ ఠాకూర్ రామ సింగ్‌ను కలిసి వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో నాయకులు సాయిబాబ, అంజిబాబు, రాజశేఖర్, సీపీఐ నగర సమితి కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో నాయకులు రామకృష్ణారెడ్డి, మహేష్, శ్రీనివాసులు, సీపీఐ న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుడిపై చర్యలకు సిద్ధం

- రూ.36 లక్షల దుర్వినియోగానికి పాల్పడిన వ్యవసాయ శాఖ డీడీఏ
- అభియోగాలు నమోదు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఓ అధికారి రూ. లక్ష కాదు.. రెండు లక్షలు కాదు... ఏకంగా రూ.36 లక్షలు కొల్లగొట్టాడు. ఎక్కడా నిబంధనలు పట్టించుకోలేదు. ఎట్టకేలకు ఆయన అక్రమాలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అభియోగాలు నమోదు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013 నుంచి దాదాపు మూడేళ్ల పాటు భూసంరక్షణ విభాగం ఆదోని ఏడీఏగా పని చేసి నిధులను దుర్వినియోగం చేశారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ అయిన రాము నాయక్ ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా రైతుశిక్షణ కేంద్రం డీడీఏగా ఉన్నా.. ఆన్ డ్యూటీపై ఎమ్మిగనూరు పీడీడీఎఫ్ డీడీఏగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన అక్రమాలపై అభియోగాలు నమోదు చేస్తూ ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబరు 6 జారీ చేసింది. 2013–14లో ఆర్ఏడీ కింద పత్తికొండలోని చైతన్య నర్సరీకి రూ.12.42 లక్షల సబ్సిడీ విడుదల చేశాడు. 2014–15లో రూ.5.10 లక్షలు విద్యుత్ మోటార్ల కోసం క్రిషి ఎంటర్‌ప్రైజెస్‌కు విడుదల చేశాడు. ఈ సంస్థకు ఎలాంటి అనుమతులు లేవు. విద్యుత్ మోటార్లు లేవు.. కాని వాటర్ క్యారియంగ్ పైపులు తీసుకున్నట్లు రికార్డు చేశాడు. బిల్లులు లేవు.. ఓచర్లు లేవు. ఇదే తరహాలో అనుమతి లేని ఇదే సంస్థకు మరోసారి రూ.11.25 లక్షలు వాటర్ క్యారియింగ్ పైపుల కోసం విడుదల చేశాడు. 2017లో మూడు దఫాలుగా రూ.2.06 లక్షలు స్వాహా చేశాడు.

సెల్ఫ్ చెక్‌లతో నిధుల స్వాహా...!

ఎలాంటి అనుమతి లేకపోయినప్పటికీ అద్దె వాహనం పేరుతో రూ.3.37 లక్షలు డ్రా చేశాడు. ఇందుకు సంబంధించి లా బుక్ కూడా లేకపోవడం గమనార్హం. కండీషన్‌లో లేని వాహనానికి డీజిల్ పేరుతో రూ.79,387 డ్రా చేశాడు. కంప్యూటర్లు, ప్రింటర్లు కొనుగోలు చేసినట్లు కూడా నిధులు ఆరగించారు. కొన్నట్లు బిల్లులు లేకపోవడం గమనార్హం. క్యాష్ బుక్ నిర్వహణ పేరుతో రూ.78 వేలు, కంప్యూటర్ రిపేరీ పేరుతో రూ.14,000 డ్రా చేశాడు. వీటికి సంబంధించి ఎలాంటి రుజువులు లేవు. భూ సంరక్షణ విభాగం ఆదోని ఏడీఏగా పనిచేస్తున్నప్పుడు సాగించిన అక్రమాలు అన్నీ, ఇన్నీ కావు. అభియోగాలు నమోదు చేయడం వ్యవసాయ శాఖలో సంచలనంగా మారింది. ప్రస్తుతం ఆన్‌డ్యూటీపై ఎమ్మిగనూరు పీడీడీఎఫ్ డీడీఏగా కొనసాగుతున్నా... తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

రూ.70 లక్షల స్వాహాకు యత్నం...

ఆదోనిలో పని చేస్తున్నప్పుడు సాగించిన అక్రమాలు ఒక ఎత్తు అయితే.. అంతకు మించిన మరో దందాకు తెరలేపాడు. ఈయన 2019 జూలై వరకు కర్నూలులో భూసంరక్షణ విభాగం డీడీఏగా పనిచేశాడు. అయితే 2020లో కర్నూలులో పనిచేస్తున్నట్లుగా రూ.70 లక్షలు కొల్లగొట్టేందుకు 527 యూసీలపై సంతకాలు చేయడం కలకలం రేపింది. ఈ నిధులను కూడా కొల్లగొట్టేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. పని చేయని కాలంలో పని చేస్తున్నట్లు యూసీలపై సంతకాలు చేయడాన్ని వ్యవసాయ శాఖ తీవ్రంగా పరిగణించింది.

నాణ్యమైన పత్తి దిగుబడులను సాధించాలి



పత్తి సాగులో మెలకువల కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత, అధికారులు

కోడుమూరు రూరల్: పత్తి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన పత్తి దిగుబడులు సాధించాలని ఏపీ హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత సూచించారు. శుక్రవారం కోడుమూరు వాసవీ కల్యాణమండపంలో నాణ్యమైన పత్తి దిగుబడులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ సెక్రటరీ సునీతతో పాటు, అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, కర్నూలు జేడీఏ వరలక్ష్మి, నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి, ఏడీఏలు సాలురెడ్డి, వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ రైతులు పత్తి పంట సాగులో సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించడం, పత్తి తీతల సమయంలో తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చునన్నారు. జేడీఏ వరలక్ష్మి మాట్లాడుతూ వాతావరణ మార్పులు, గులాబీరంగు పురుగు, తెగుళ్ల కారణంగా ఈ ఏడాది జిల్లాలో దిగుబడులు తగ్గాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, ఏఓ రవిప్రకాష్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి, హ్యాండ్ లూమ్స్ టెక్స్‌టైల్ ఏడీ నాగరాజు, మారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో మల్లన్న ఆలయం

రారండోయ్ బ్రహ్మోత్సవాలు చూద్దాం

- నేటి నుంచి శ్రీశైలంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రమణ బ్రహ్మోత్సవాలకు శ్రీశైలక్షేత్రం ముస్తాబైంది. శనివారం నుంచి ఈ నెల 17వ తేది వరకు పంచాహ్నికదీక్షతో ఏడు రోజుల పాటు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఇప్పటికే ఇందుకు అవసరమైన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు పూర్తి చేశారు. నేటి నుంచి ప్రతిరోజు స్వామిఅమ్మవార్లకు విశేషంగా వాహన సేవ నిర్వహిస్తారు. శనివారం ఉదయం 8.45గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం, సాయంత్రం 5.30గంటలకు అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠాపన, 7గంటలకు ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ కార్యక్రమాలు చేస్తారు.

ముఖ్యమైన కార్యక్రమాలు

- ➡ బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు ఆదివారం నుంచి స్వామి అమ్మవార్లకు విశేష వాహన సేవలు
- ➡ 14వ తేది మకర సంక్రాంతి రోజున స్వామి అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం



క్షేత్ర పరిధిలో స్వాగత తోరణాలు

- ➡ ఈ నెల 16న ఉదయం యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, సాయంత్రం సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ
- ➡ బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన 17న పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలు
- ➡ 13న భోగిరోజు ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగాణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో చిన్నారులకు సామూహిక భోగి పండ్ల కార్యక్రమం
- ➡ 14న మహిళలకు ముగ్గుల పోటీలు ఉంటాయి. ఆసక్తి గల వారు 13వ తేది సాయంత్రం లోపు పేర్లను నమోదు చేసుకోవాలి.

క్లుప్తంగా

13 నుంచి ఆర్‌యూకు సంక్రాంతి సెలవులు

కర్నూలు కల్చరల్‌: రాయలసీమ విశ్వవిద్యాలయానికి ఈనెల 13వ తేదీ నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించారు. పండుగ సెలవుల అనంతరం ఈనెల 20వ తేదీన యూనివర్సిటీ పునఃప్రారంభం కానుంది. వీటితో 11వ తేదీ రెండవ శనివారం, 12వ తేదీ ఆదివారం రావడంతో మరో రెండు రోజుల సెలవులు అదనంగా కలిసివచ్చినట్లు అయ్యింది.

మహిళ దారుణహత్య



హత్యకు గురైన కురువ బసమ్మ

కౌతాళం: కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో సుళేకేరి గ్రామానికి చెందిన మహిళ దారుణహత్యకు గురైంది. గ్రామానికి చెందిన కురవ బసమ్మ(52)కు ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన కురవ మారెప్పతో వివాహమైంది. వీరికి సంతానం లేదు. భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో పుట్టింటికి చేరి జీవనం సాగిస్తోంది. కర్ణాటకలోని హచ్చోళ్లిలో ఉచిత గ్యాస్‌ ఇస్తున్నారని గురువారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరినట్లు తెలుస్తోంది. కాగా శుక్రవారం ఉదయం కర్ణాటక సరిహద్దులోని మురవణి గ్రామ పొలాల్లో హత్యకు గురైంది. పొలం పనులకు వెళ్లిన కూలీలు మృతదేహాన్ని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టగా హత్యకు గురైన మహిళ కౌతాళం మండలం సుళేకేరి గ్రామానికి చెందిన కురవ బసమ్మగా గుర్తించారు. ఎవరో దుండగులు గొంతుకోసి హత్యచేసినట్లు తెలుస్తోంది. కర్ణాటక పోలీసులు స్థానిక కౌతాళం పోలీసుల సహకారంతో సుళేకేరి గ్రామానికి వచ్చి విచారించి దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం శిరుగుప్ప ఆసుపత్రికి తరలించారు. త్వరలో కేసును ఛేదించి నిందితులను అరెస్ట్‌ చేస్తామని తెలిపారు.

ప్రతి పంచాయతీలో ఆదర్శ పాఠశాల

- పాఠశాల విద్య కమిషనర్‌ వి.విజయరామరాజు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పాఠశాల విద్య కమిషనర్‌ వి.విజయరామరాజు

కర్నూలు సిటీ: ప్రతి పంచాయతీలో ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేస్తామని పాఠశాల విద్య కమిషనర్‌ వి.విజయరామరాజు తెలిపారు. స్కూల్‌ కాంప్లెక్స్‌ పునర్నిర్మాణ కార్యక్రమంపై విజయవాడ నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులతో కమిషనర్‌ సమీక్ష నిర్వహించారు. సమీక్షకు జిల్లా నుంచి పాఠశాల విద్య కడప ఆర్జేడీ శామ్యూల్‌, డీఈఓ శ్యామూల్‌ పాల్‌, ఏపీసీ టి.శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. జీఓ నంబరు 117 రద్దు అనంతరం తీసుకొచ్చే జీఓపై ఈ నెల 20వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో అధికారులతో సమావేశం కానున్నట్లు తెలిపారు. కొత్త జీఓ ఆధారంగా మున్సిపల్‌ స్కూళ్లలో పోస్టులను సర్దుబాటు చేస్తారన్నారు. 75 మందికిపైగా విద్యార్థులు ఉన్న హైస్కూళ్లకు హెచ్‌ఎం పోస్టుతో పాటు, ఒక పీడీ పోస్టును మంజూరు చేస్తామన్నారు.



హాజరైన ఆర్జేడీ, డీఈఓ తదితరులు



ఎమ్మిగనూరు పట్టణం అన్నమయ్య సర్కిల్లో భక్తజనం మధ్య వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రుద్రవరం మండలంలో పూజలందుకున్న వాసాపురం వేంకటేశ్వర స్వామి



మహానంది ఆలయంలో హనుమద్వాహనంపై శ్రీరాముల ఉత్సవం



మద్దికెర మండలం పెరవలిలో పల్లకీలో ఊరేగుతున్న శ్రీరంగనాథుడు



అవుకు గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు

వైకుంఠ ఏకాదశి.. ఆధ్యాత్మిక దీప్తి

వైకుంఠ ఏకాదశి రోజున ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. అలంకరించిన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. పలుచోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కర్నూలు నగరంతో పాటు నంద్యాల, ఆదోని, మంత్రాలయం, శ్రీశైలం, మహానంది, అహోబిలం, డోన్‌, పత్తికొండ, నందికొట్కూరు, కల్లూరు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లోని వైష్ణవ, శైవ ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరిలో భక్తిపారవశ్యాన్ని నింపాయి.

–సాక్షినెట్‌వర్క్‌



మంత్రాలయంలో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు



నంద్యాల సుబ్బమ్మ కల్యాణ మండపంలో వేంకటేశ్వర స్వామి



ఆస్పరిలో పూజలందుకున్న జనార్దనస్వామి



శ్రీశైలంలో స్వామిఅమ్మవార్లకు పుష్పార్చన నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీరంగాపురంలో భక్తులతో పోటెత్తిన మద్దిలేటిస్వామి ఆలయం



గోరంట్ల శ్రీలక్ష్మీమాధవుడిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు




నంద్యాల పట్టణంలో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు



ఆదోని పట్టణంలో స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

పోరాట వీరుడు.. వడ్డే ఓబన్న

- ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నమ్మిన బంటు
- ఉయ్యాలవాడకు ముఖ్య అనుచరుడిగా ఉంటూ ఉద్యమాలకు ఊపిరి పోసిన ఓబన్న
- వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం
- నేడు వడ్డే ఓబన్న జయంతి



వడ్డె ఓబన్న ఊహా చిత్రం

కర్నూలు కల్చరల్‌: తొలి స్వాతంత్య్ర సమర యోధుడు ఆయన. తెల్ల దొరల నిరంకుశత్వ పాలనను ప్రతిఘటించిన వీరుడు. దేశం కోసం ప్రాణాలు లెక్కచేయని ధీరుడు. ఆయనెవ్వరు అనుకుంటున్నారా 1842వ సంవత్సరంలోనే తిరుగుబాటు బావుట ఎగురవేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కుడిభుజం వడ్డె ఓబన్న. నొస్సం పాలెగాడు జయరామిరెడ్డి అనుచరుడు వడ్డె సుబ్బన్న కుమారుడే వడ్డె ఓబన్న. అప్పటికే తెల్లదొరల పాలనను వ్యతిరేకిస్తున్న నరసింహారెడ్డి దగ్గర పనిచేసేందుకు ఓబన్నను ఆయన తండ్రి ఉయ్యాలవాడకు పంపాడు. ఇద్దరు సమవయస్కులు కావడంతో క్రమంగా నరసింహారెడ్డికి ఓబన్న దగ్గరై సేవ చేస్తూ ముఖ్య అనుచరుడిగా ఎదిగి కుడి భుజం అయ్యాడు. ఓబన్న ఉయ్యాలవాడలోనే ఉంటూ తమ బంధువుల అమ్మాయినే వివాహం చేసుకున్నాడు. నరసింహారెడ్డి బ్రిటీష్‌ వారితో పోరాటం మొదలు పెట్టాక అతనికి అండగా నిలిచాడు. కోవెలకుంట్ల తహసీల్దార్‌ను నరికి చంపడమే కాకుండా బ్రిటీష్‌వారి ఖజానాను కొల్లగొడంలో నరసింహారెడ్డితో పాటు ఓబన్న పాలు పంచుకొని సాయం చేశాడు. అన్ని బీసీ కులాలను, ఎస్సీ కులాలను సమీకరించి నరసింహారెడ్డికి అనుచరులను తయారు చేయడం, రెండువేల సైన్యం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. నరసింహారెడ్డి చేసిన అన్ని పోరాటాల్లో వెన్నంటి నిలిచాడు. అతను పట్టు బడకుండా చూశాడు. బ్రిటీష్‌ సైన్యం 1847లో సంజామల మండలం జగన్నాథ గుట్టపై నరసింహారెడ్డిని ప్రాణాలతో పట్టుకుంది. అతనితో పాటు అతని అనుచరులు వడ్డే ఓబన్న, గోశాయి వెంకన్న, అవుకు నారాయణ రాజులు పట్టుబడ్డారు. సుమారు 900 మందిపై కేసులు నమోదు చేశారు. నరసింహారెడ్డిని బందిపోటు దొంగగా ముద్రవేసి ఫిబ్రవరి 22వ తేదీన కోవెలకుంట్ల సమీపంలోని జుర్రేరు ఒడ్డున ఉరిశిక్ష వేశారు. ఓబన్న మిగిలిన అనుచరులను అండమాన్‌ జైల్‌కు పంపారు. 900 మందిలో కొందరిని విడుదల చేశారు. మరికొందరిని విచారించి జైలు శిక్షలు వేశారు. నరసింహారెడ్డికి జీవించి ఉన్నంత వరకు కుడి భుజంగా ఉంటూ అన్ని పోరాటాల్లో సహకరించి జైలు శిక్ష అనుభవించి చరిత్రలో నిలిచాడు వడ్డె ఓబన్న.

ఓబన్న జీవితంపై నవల

ప్రముఖ నవల రచయిత ఎస్‌డీవీ అజీజ్‌ వడ్డె ఓబన్న జీవిత చరిత్ర ఆధారంగా 'ఓబన్న' నవల రాశారు. ఆనాటి జీవన పరిస్థితి, సామాజిక, రాజకీయ పరిస్థితులు ఈ నవలలో ప్రతిబింబిస్తాయి. వడ్డె వారి జీవన విధానం వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార పదార్థాలు, వివాహ శుభకార్యాలు నవలలో పొందుపరిచారు. ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమని రచయిత ఎస్‌డీవీ అజీజ్‌ పేర్కొన్నారు.

జాతీయ స్థాయి నృత్య పోటీలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్‌: కళా సౌరభ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నటరాజ నృత్య కళామందిర్‌, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో మూడు రోజుల శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. సీక్యాంప్‌ టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం పారిశ్రామికవేత్త, సినీనటుడు బీవీ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలతో మనో వికాసం కలుగుతుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు కళలు ప్రతిబింభంగా నిలుస్తాయన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు నృత్య ప్రదర్శన పోటీలకు హాజరు కావడం అభినందనీయమన్నారు. జానపద శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చూడటానికి తల్లిదండ్రులతో పాటు ప్రేక్షకులకు ఆసక్తి ఉండాలన్నారు. శ్రీ నటరాజ నృత్య కళా మందిర్‌ నిర్వాహకులు కరీముల్లా మాట్లాడుతూ వరుసగా పదవ సంవత్సరం కళా సౌరభ అవార్డుల నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. సప్తగిరుల వైభవం నృత్య రూపక పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో నటరాజ నృత్య కళా మందిర్‌ అధ్యక్షులు స్వరూపసింహ, ఉపాధ్యాయులు క్రిష్టిపాటి రామశర్మ, వ్యాఖ్యాత సునిత పాల్గొన్నారు.

ఘనంగా కేవీఆర్‌ కాలేజీ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు సిటీ: కేవీఆర్‌ బాలికల జూనియర్‌ కాలేజీ 29వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఇంటర్మీడియట్‌ ప్రాంతీయ కార్యాలయ అధికారి జీవీఎస్‌ గురవయ్య శెట్టి, జిల్లా వృత్తివిద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎంపీ ప్రకటించారు. జూనియర్‌ కాలేజీకి అభివృద్ధికి సహకరించిన జిల్లా గత కలెక్టర్‌ జి.సృజనకు ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌ లాలెప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఆ తరువాత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశ్రాంత ప్రిన్సిపాళ్లు కృష్ణారెడ్డి, కె. చెన్నయ్య, టౌన్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ సుంకన్న, బిక్యాంపు జూనియర్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ సరళాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వొకేషనల్‌ జూనియర్‌ కాలేజీలో..

బిక్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్‌ జూనియర్‌ కాలేజీ 17వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాలేజీలో మూడు తరగతి గదులకు, పది కంప్యూటర్ల ఏర్పాటుకు ఎంపీ నిధులు ఇస్తానని హామీనిచ్చారు. ఏపీఎస్‌పీ బెటాలియన్‌ డీఎస్పీ మహబూబ్‌ బాషా, డీవీఈఓ పరమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్‌ నాగస్వామి నాయక్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి పవన్‌ కళ్యాణ్‌ రాక

కర్నూలు(అర్బన్‌): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌ కళ్యాణ్‌ ఈ నెల 11వ తేదీన కర్నూలుకు రానున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 11.30 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గని సోలార్‌ పార్క్‌, పంప్డ్‌ స్టోరేజ్‌ ప్రాజెక్టు సైట్‌ను ఏరియల్‌ వ్యూ ద్వారా 12.30 గంటల వరకు పరిశీలిస్తారు. అనంతరం అప్పర్‌ రిజర్వాయర్‌ హెలిప్యాడ్‌ నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి అప్పర్‌ ఇంటెక్‌ వ్యూ పాయింట్‌కు చేరుకొని ప్రాజెక్టును పరిశీలిస్తారు. తిరిగి అక్కడి నుంచి పవర్‌ హౌస్‌ మీదుగా టీఆర్‌సీ వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు. 1.45 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సైట్‌ వ్యూ, 2.15 గంటలకు రోడ్డు మార్గం ద్వారా గెస్ట్‌ హౌస్‌ చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. 3.35 గంటలకు బీ 3 బ్లాక్‌ వద్ద సంబంధిత అధికారులు ఉప ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్‌ ద్వారా ప్రాజెక్టు వివరాలను వివరిస్తారు. అనంతరం అక్కడి నుంచి అప్పర్‌ ఇంటెక్‌ వ్యూ పాయింట్‌కు 4.20 గంటలకు చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 4.50 గంటలకు కర్నూలు విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి గన్నవరం తిరిగి బయలుదేరుతారు.

ఊరికెట్లా వెళ్లేది!



బస్సు కోసం పరుగో.. పరుగు





విద్యా సంస్థలకు సంక్రాంతి పండుగ సెలవులు ఇవ్వడంతో ఇంటికి బయలుదేరిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న విద్యార్థులు, ప్రయాణికులతో శుక్రవారం కర్నూలు బస్టాండ్‌ కిటకిటలాడింది. హైదరాబాద్‌, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపి ఆదాయం పెంచుకునే ఆలోచన చేసిన ఆర్టీసీ అధికారులు పల్లెలకు వెళ్లాల్సిన వారిని విస్మరించింది. రద్దీ మేరకు బస్సులు లేక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వచ్చిన బస్సు వచ్చినట్లు నిండటంతో సీట్ల కోసం ఫీట్లు చేయాల్సి వచ్చింది. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, కర్నూలు





స్విచాఫ్ ది ఫోన్!

ఓపెన్ ది మైండ్!

ప్రస్తుత కాలంలో ఫోన్‌తోనే ప్రతి ఒక్కరికీ పని. స్మార్ట్ ఫోనే ఫ్రెండ్. ఫోనే పార్ట్‌నర్. సెల్లే సర్వస్వం. అయితే ఓ రోజు ఫోన్ లేకుండా గడిపితే ఎలా ఉంటుంది. వారంలో ఓ రోజు పనికి సెలవు తీసుకున్నట్లే ఫోన్‌కి స్విచ్ ఆఫ్ చేసి పక్కన పడేస్తే..? వారాంతంలో ఓ రోజు పనికి దూరంగా ఉన్నట్లే ఫోన్‌కు దూరంగా ఉంటే ఎలా ఉంటుంది.. అనే ఆలోచన ఊహించడానికే ఏదోలా ఉంది కదా... అదేం కాదు.. ఫోన్ లేకపోతే ఏం జరుగుతుందో చూద్దాం.

చేతిలో ఫోన్ లేకపోతే మెదడు ఓపెన్ అవుతుంది. సొంతంగా ఆలోచించడం ఆరంభం అవుతుంది. ఒకదానితో మరొక విషయాన్ని బేరీజు వేసుకోవడం మొదలుపెట్టే ఖాళీని మెదడుకు ఇచ్చి చూద్దాం.

సెలవు రోజు ఇంటికి అవసరమైన వస్తువులు తెచ్చుకోవడం లేదా ఆర్డర్ చేసుకోవడం వంటి పనులు పూర్తి చేసుకున్న తర్వాత ఇక ఆ రోజుకు ఫోన్ ముట్టుకోవద్దు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంట్లో పెట్టి కాలనీలో రోడ్లన్నీ చుట్టి వస్తే... మనం నివసించే ప్రదేశం ఎలా ఉందో తెలుస్తుంది. కొత్తగా కడుతున్న ఓ భవనం కనిపిస్తుంది. ఇంతకు ముందు ఈ ప్రదేశంలో ఏముండేది? ఓ ప్రశ్న మదిలో మెదలుతుంది. కానీ సమాధానమే తట్టదు. గడచిన పదేళ్లుగా ఇదే కాలనీలో ఉన్నప్పటికీ వారంలో పది–పదిహేను సార్లు ఇదే దారిలో ప్రయాణించినప్పటికీ మనం ఈ ప్రదేశానికి చిరపరిచితులం కాలేకపోయామా అనే సందేహం కూడా అనిపిస్తుంది. నిజానికి ఈ ప్రదేశానికి మనం చిరపరిచితులయ్యాం, కానీ మనకే ఈ ప్రదేశం చిరపరిచితంగా మారలేకపోయింది. ఒక్కరోజైనా చేతిలో ఉన్న ఫోన్‌ని జేబులో పెట్టుకుని ఈ దారిలో



నడిచి ఉంటే కదా! ఏ విషయమైనా మెదడు గ్రహింపుకు వచ్చేది. అనుక్షణం కళ్లు, చెవులు, మెదడు ఫోన్‌తో ఎంగేజ్ అయి ఉంటాయి. అలవాటు పడిన దారిలో దేహం యాంత్రికంగా సాగిపోతూ ఉంటుంది. పనులు ముగించుకుని ఇంటికి వచ్చి కూర్చున్న తర్వాత కూడా టీవీ స్క్రీన్ మీద దృష్టి కేంద్రీకరిస్తాం. ప్రపంచంలోని విషయాలన్నింటినీ మెదడులోకి గుప్పించడంలోనే రోజు పూర్తవుతుంటే... ఇక మెదడు సొంతంగా ఆలోచించేదెప్పుడు? ఆ మాత్రం వెసులుబాటు దొరికినప్పుడే మెదడు తన సృజనాత్మకతను బయటపెడుతుంది.

ఒక గంటతో మొదలు పెట్టండి!

వారంలో ఓ రోజు ఫోన్, టీవీ, కంప్యూటర్, ట్యాబ్, ల్యాప్‌టాప్ అన్నింటికీ సెలవు ప్రకటించి తీరాలి. మెదడుకు రెక్కలు విచ్చుకుని విహరించే అవకాశం కల్పించాలి. ఒకేసారి రోజంతా అన్ని స్క్రీన్‌లకూ ఆఫ్ అంటే కొంత కష్టం కావచ్చు. టీవీ, కంప్యూటర్‌లైతే మన చేతిలోనే ఉంటాయి. ఫోన్ కాల్స్ మన చేతిలో ఉండవు. ఇంట్లో ఒక ఫోన్ స్విచాఫ్‌లో ఉంటే 'ఫోన్ ఆఫ్‌లో ఉందేమిటి' అంటూ మరొకరి ఫోన్‌కు కాల్స్ వస్తుంటాయి. కాబట్టి మొదట్లో ఒక గంటతో మొదలు పెట్టండి. రెగ్యులర్‌గా ఫోన్ చేసే స్నేహితులు, బంధువులకు 'ఇది స్విచాఫ్ అవర్' అని మెసేజ్ పెట్టేసి ఫోన్ బంద్ చేయాలి. గంటతో మొదలు పెట్టి క్రమంగా 'స్విచాఫ్ డే'గా మార్చాలి. 'స్విచాఫ్ డే' కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకునే రోజవుతుంది. కుటుంబ బంధాలు ఆనందాల హరివిల్లుగా మారుతాయి.

● మీకు తెలుసా

ఎండు పండ్లు ఎంత ఆరోగ్యం?

ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి తగినన్ని ప్రొటీన్స్, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ అవసరం. వీటన్నింటిని పొందడానికి డ్రై ఫ్రూట్స్ ఒక మంచి ఆప్షన్. అందుకే డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లతోపాటు చాలామంది తెలిసిన వాళ్లు కూడా చెబుతారు. అయితే అవి ఆరోగ్యానికి మంచిది కదా అని.. ఇష్టమొచ్చినట్టు తింటే



ఆరోగ్యానికి మేలు బదులు ముప్పు వాటిల్లుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

అతి సర్వత్రా వర్జయేత్ అన్నారు పెద్దలు. అంటే ఎందులోనూ అతి పనికి రాదన్నమాట. ఈ సూత్రం డ్రై ఫ్రూట్స్‌కి కూడా వర్తిస్తుంది.

డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే.. షుగర్స్, క్యాలరీలు కూడా ఉంటాయి. కాబట్టి వీటిని 20 గ్రాముల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే నేరుగా తినడం కూడా మంచిది కాదు.

యోగా

భుజబలానికి కీలకం

నేలపైన మ్యాట్ వేసుకొని, శరీరాన్నంతా స్ట్రైచ్ చేస్తూ చేయాలని అందరూ యోగా చేయడానికి సిద్ధ పడరు. అందుకు వయసు, అనారోగ్యం, చిన్న చిన్న గాయాలు వంటివి కారణం అవుతుంటాయి. ఇలాంటప్పుడు కుర్చీ లేదా సోఫాలో కూర్చొని కూడా యోగ సాధన చేయవచ్చు.

ఈగిల్ ఆర్మ్స్ భంగిమ అంటే ఇది గరుడాసనను పోలిన విధంగా ఉంటుంది. ఇందులో కూర్చొనే విధానంలోనే తేడా ఉంటుంది. శరీర కదలికలకు, శ్వాస పని తీరులో మెరుగుకు ఇలా సాధన చేయవచ్చు.



ఇలా ప్రయత్నించవచ్చు..

● కుర్చీలో నిటారుగా కూర్చొని, పాదాలను నేలమీద ఆనించాలి. దీర్ఘశ్వాస తీసుకుని, వదులుతూ చేతులను విశాలంగా గరుడ పక్షి రెక్కల్లా చాచాలి. భుజాలను నిటారుగా ఉంచాలి.



● ఐదు శ్వాసలు తీసుకొని, వదిలిన తర్వాత రెండు చేతులను పైకి ఎత్తాలి. చేతులను సాధ్యమైనంత పైకి సాగదీస్తున్నట్టు ఉంచాలి. ఆ తర్వాత రెండు చేతులను హృదయస్థానానికి తీసుకురావాలి. కుడి చేతిని ఎడమ చెయ్యి కింద నుంచి తీసుకుంటూ వ్యతిరేక దిశలో రెండు చేతులను పట్టుకోవాలి. ఈ సమయంలో భుజాలు కూడా కొద్దిగా ముందుగా వంగుతాయి. ఈ భంగిమను రోజూ సాధన చేస్తుంటే ముంజేతుల దగ్గర నుంచి ఒకదాన్నొకటి చుట్టినట్టుగా వస్తుంది. ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలాలి. తిరిగి మెల్లగా యథాస్థితికి రావాలి.

● ఇదే విధంగా ఎడమ నుంచి కుడి చేతివైపుకు కూడా చేయాలి. ఒక్కో భంగిమలో ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదులుతూ సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది.

● కుర్చీ/సోఫాలో కూర్చున్నప్పుడు కాళ్లను కూడా నేల మీద నుంచి వీలైనంత పైకి లేపి, పది సెకన్లు ఉంచి, తిరిగి యథాస్థానంలోకి తీసుకురావచ్చు. ఈ విధంగా చేయడం వల్ల పాదాల వరకు రక్త ప్రసరణ మెరుగవుతుంది.

పాలు... రాగులు ఏవి బెటర్

శరీరానికి కాల్షియం అనేక రోజువారీ పనులు చేసేందుకు ఉపకరిస్తుంది. అందువల్ల మన డైట్‌లో కాల్షియంని చేర్చుకోవడం ముఖ్యం. జున్ను, బొప్పాయి, మల్బరీ, లిచీ, కివి, బచ్చలికూర, బ్రకోలీలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల చాలా సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. ఆరోగ్యంగా కూడా ఉంటారు.


పాలు, రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఎందులో ఉంటుందంటే...

పాలు, రాగులు రెండూ ఒకదానికి మించి లాభాలని అందిస్తాయి. ఉదాహరణకి..100 మి.లీ పాలు తాగితే 110 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. అదే 100 గ్రాముల రాగులని తీసుకుంటే, దాదాపు 350 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థని ఆరోగ్యంగా ఉంచితే, ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల రక్తహీనత ఉన్నవారికి రాగులు మంచిది. రాగుల్లో ఉండే పొటాషియం వంటి ఇతర పోషకాలు మొత్తం శరీర ఆరోగ్యానికి సాయపడతాయి. పాలలో పోషకాలతోపాటు ఉండే ఎలక్ట్రోలైట్స్ బాడీని హైడ్రేట్ చేస్తాయి. రాగులు షుగర్ ఉన్నవారికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండి గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది బ్లడ్ షుగర్ లెవల్స్‌ని నియంత్రిస్తుంది కాబట్టి, మీ అవసరాలని బట్టి ఏది మంచిదో నిర్ణయించుకోవడం ఉత్తమం.



తొక్కలతో మొక్కలకు పోషణ

చాలా మంది వేరుశెనగ పప్పుల్ని తిని.. వాటి తొక్కల్ని పారేస్తుంటారు. అయితే, మనం వేస్ట్ అనుకున్న ఈ తొక్కలతో చాలా ప్రయోజనాలు ఉన్నాయి. వేరుశెనగ తొక్కల్లో నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఉన్నాయి. ఇవి మొక్కల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సాయపడతాయి. అంతే కాకుండా వీటిలో ఫైబర్, ప్రోటీన్ కూడా ఉన్నాయి. ఇవి మొక్కలకు తగిన పోషణ ఇస్తాయి. వేరుశెనగ తొక్కల్ని ఉపయోగించి కంపోస్ట్ ఎరువు తయారు చేయవచ్చు. ఇందుకోసం వేరుశెనగ తొక్కల్ని బాగా ఎండబెట్టాలి. ఆ తర్వాత వీటిని బాగా మెత్తగా పొడిలా చేసుకోండి. ఈ పొడిని ఇప్పుడు డైరెక్ట్‌గా కుండీలోని మట్టిలో కలపవచ్చు. వేరుశెనగ తొక్కల పొడిని వాడే ముందు మట్టి బాగా కలియబెట్టాలని మరచిపోకూడదు. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది బాగా పచ్చగా, ఏపుగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.



మరకలు ఇలా మాయం..

ఉన్ని దుస్తుల మీద మరకలు ఏర్పడితే.. వాటిని డైరెక్ట్‌గా వాషింగ్ మెషిన్‌లో ఉపయోగించకూడదు. వాషింగ్ మెషిన్‌లో వేయడానికి ముందు.. సాఫ్ట్ స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించాలి. తేలికపాటి లిక్విడ్ డిటర్జెంట్, నిమ్మరసం వంటి వాటిని అప్లై చేసి.. స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించడం బెస్ట్ ఆప్షన్. ఆ తర్వాత మరకలు తొలగిన తర్వాత వాష్ మెషిన్‌లో వేసి బట్టలు ఉతకవచ్చు.



మీకు తెలుసా?

చాలా మంది కూల్ డ్రింక్స్ తాగుతుంటారు. అందులోనూ సోడా ఉండే వాటిని ఎక్కువ మంది ఇష్టంగా తీసుకుంటారు. వేసవికాలం, చలికాలం అనే సంబంధం లేకుండా వీటి వాడకం ఎక్కువగా ఉంటుంది. వీటి వల్ల కలిగే ప్రయోజనాల కన్నా... ఆరోగ్య సమస్యలే ఎక్కువ. కూల్ డ్రింకులు, సోడాలు, చక్కెర పానీయాలు తాగడం వల్ల మధుమేహం,ఊబకాయం, కొవ్వు పెరిగి కాలేయం, మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని పెంచుతుంది. కొందరు సోడాకు బదులు డైట్ సోడా తాగితే ఆరోగ్యంపై అంతగా ప్రభావం ఉండదని అనుకుంటూ ఉంటారు. కానీ, మెటబాలిక్ సిండ్రోమ్, అలాగే స్ట్రోక్ ప్రమాదాలను పెంచుతుందని పలు అధ్యయనాల్లో తేలింది. మరి కొన్ని పరిశోధనల ప్రకారం, డైట్ సోడా వినియోగం కూడా ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుంది.



ఊహలకు మించి ఉంటుంది

– బాలకృష్ణ



● ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్, బాలకృష్ణ, ప్రగ్యా జైస్వాల్

''సంక్రాంతి పండగకి విడుదలైన నా సినిమాలన్నీ ఘన విజయం సాధించాయి. ఈ సంక్రాంతి కానుకగా రిలీజవుతున్న 'డాకు మహారాజ్' కూడా ఘన విజయం సాధిస్తుంది. ఈ చిత్రం గురించి ప్రేక్షకులు ఏం ఊహించుకుంటున్నారో అంతకు మించి ఈ సినిమా ఉంటుంది'' అని బాలకృష్ణ చెప్పారు. బాబీ కొల్లి దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా, బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా కీలక పాత్రలు చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ రేపు (ఆదివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ– ''తిరుపతి తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి'.. ఇలా వరుస ఘన విజయాల తర్వాత వస్తున్న 'డాకు మహారాజ్'తో మరో ఘన విజయాన్ని అందుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. బాబీ కొల్లి మాట్లాడుతూ–''నా టీమ్‌తో కలిసి ఎంతో శ్రద్ధగా 'డాకు మహారాజ్' కథని సిద్ధం చేశాను. బాలకృష్ణగారితో ఒకసారి పని చేస్తే మళ్లీ పని చేయాలనిపిస్తుంటుంది'' అని చెప్పారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ– ''ఐదేళ్ల క్రితం వైకుంఠ ఏకాదశి రోజున 'అల వైకుంఠపురములో' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చేసి, జనవరి 12న ఆదివారం సినిమా విడుదల చేశాం. ఇప్పుడు 'డాకు మహారాజ్'కి కూడా అదే జరిగింది. 'అల వైకుంఠపురములో'లాగే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ–''కొన్ని సినిమాలకు ప్రాణం పెట్టి సంగీతం చేయాలనిపిస్తుంది. అలాంటి సినిమా 'డాకు మహారాజ్'' అన్నారు. ఈ వేడుకలో వైజాగ్ ఎంపీ భరత్, బాలకృష్ణ కుమార్తె తేజస్విని, కెమెరామేన్ విజయ్ కన్నన్, రచయిత మోహన్ కృష్ణ తదితరులు పాల్గొని, 'డాకు మహారాజ్' చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం

– రాజమౌళి



''ఆర్‌ఆర్‌ఆర్' సినిమాని డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలో డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి థ్రిల్ అయ్యాను'' అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి చెప్పారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ హైదరాబాద్‌లో సినిమా–హోమ్ కోసం భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ స్టూడియోను నెలకొల్పింది. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ ఛైర్మన్, హీరో నాగార్జున అక్కినేని సమక్షంలో ఈ స్టూడియోను రాజమౌళి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ– ''డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం. స్పష్టత, ప్రతి ఫ్రేమ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను పెంచే విధానం కథను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. నా తర్వాతి సినిమా విడుదలయ్యే సమయానికి భారతదేశం అంతటా మల్టీ డాల్బీ సినిమా ఉంటుంది. ప్రేక్షకులు దాన్ని అనుభూతి చెందడం థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' అన్నారు. ''అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరాన్ని జరుపుకుంటున్న సందర్భంగా వర్చ్యువల్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉండడం, దేశంలో తొలి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ ఫర్ సినిమా–హోమ్‌ను ఏర్పాటు చేయడం గర్వంగా ఉంది. భారతీయ సినిమాలను మ్యాప్‌లో ఉంచడమే మా ప్రయత్నం'' అన్నారు నాగార్జున. అన్నపూర్ణ స్టూడియోస్ ఈడీ సుప్రియ యార్లగడ్డ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతికే రావాలనుకున్నాం

– అనిల్ రావిపూడి

''సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని 'బ్లాక్ బస్టర్ పొంగల్...' అనే పాట వెంకటేశ్‌గారికి చాలా నచ్చింది. దీంతో ఆయనే స్వయంగా ఆ పాట పాడతానని చెప్పడంతో నేను షాక్ అయ్యాను. కానీ ఆయన 20 నిమిషాల్లో ఆ పాట పాడటంతో సంగీత దర్శకుడు భీమ్స్ కూడా షాక్ అయ్యాడు'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి చెప్పారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి విలేకరులతో పంచుకున్న విశేషాలు...

● వెంకటేశ్‌గారితో నేను తీసిన 'ఎఫ్ 2' (2019) సంక్రాంతికి వచ్చి, విజయం సాధించింది. 'ఎఫ్ 3' కూడా సంక్రాంతికి రావాల్సింది కానీ మిస్ అయ్యింది. మా కాంబోలో మూడో సారి చేసే సినిమాని ఎలాగైనా పండగకి తీసుకొస్తే బావుంటుందని సినిమా ఆరంభం అప్పుడే సంక్రాంతికి రావాలనుకున్నాం. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం. 'సంక్రాంతికి వస్తున్నాం' కథ ఒక రెస్క్యూ ఆపరేషన్‌కి సంబంధించినది. సెకండ్ హాఫ్‌లో నాలుగు రోజుల ప్రయాణం సంక్రాంతికి ముందు ల్యాండ్ అవుతుంది. ఒక భార్య, మాజీ ప్రేయసి మధ్య నలిగే ఓ భర్త పాత్ర వెంకటేశ్‌గారిది. ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే సినిమా ఇది. ట్రైలర్ అందరికీ బాగా నచ్చింది. థియేటర్స్‌కి వచ్చాక సినిమా అద్భుతంగా నచ్చితే మూవీ బ్లాక్ బస్టరే. ● కోవిడ్ తర్వాత సినిమా సినారియో మారిపోయింది. మంచి కథ రాసి, గొప్పగా తీస్తే సరిపోదు. థియేటర్స్‌కి జనాలు రాకపోతే సినిమాకి రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమా వారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తెచ్చుకోగలమని నా అభిప్రాయం. ఈసారి ప్రమోషన్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టాం. వెంకటేశ్‌గారి లాంటి పెద్ద స్టార్ హీరో సరదాగా అల్లరి చేయడం, రీల్స్ చేయడం ప్రమోషన్స్‌కి చాలా హెల్ప్ అయ్యింది. నేను హీరోలకి ఫ్యాన్‌గానే ఉంటాను. రిలేషన్‌ని పాజిటివ్‌గా ఉంచుతాను కాబట్టి వాళ్ల నుంచి కూడా అంతే ప్రేమ వస్తుంది. ● 'దిల్' రాజుగారితో 'పటాస్' సినిమాతో నా ప్రయాణం ఆరంభమైంది. రాజుగారు, శిరీష్ గారు అంటే నా కుటుంబం లెక్క. మాది పదేళ్ల ప్రయాణం. ఇక ఉమెన్ సెంట్రిక్‌గా ఒక స్పోర్ట్స్ స్టోరీ చేయాలని ఎప్పటి నుంచో ఉంది. కొన్నాళ్ల తర్వాత ఆ నేపథ్యంలో మూవీ చేస్తాను. 'ఎఫ్ 4' సినిమా కచ్చితంగా ఉంటుంది. అయితే దానికి ఇంకా సమయం ఉంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి కూడా ఫ్రాంచైజీలు చేసుకునే అవకాశం ఉంది.

థ్రిల్లర్ రెడీ



● రవి వర్మ, శ్రీవిద్య, పూజా రామచంద్రన్

ధన్యా బాలకృష్ణ, రవి వర్మ, పూజా రామచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'హత్య'. శ్రీవిద్య బసవ దర్శకత్వంలో ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రవి వర్మ మాట్లాడుతూ– ''శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. ఈ చిత్రంలో నేను చాలెంజింగ్ రోల్ చేశాను. ఈ మూవీ ఆడియన్స్‌కు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు. ''చాలా కాలం తర్వాత 'హత్య' వంటి ఓ డిఫరెంట్ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను'' అన్నారు పూజా రామచంద్రన్. ''నా తొలి చిత్రం 'మధ' తరహాలోనే నా రెండో చిత్రం 'హత్య' కూడా థ్రిల్లర్ మూవీ. ప్రేక్షకులు ఈ మూవీని ఆదరించాలి'' అని కోరారు శ్రీవిద్య. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ నరేశ్ కుమారన్ .పి మాట్లాడారు.

ఒక పథకం ప్రకారం....

సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రుతీ సోధి, ఆషిమా నర్వాల్ హీరోయిన్లుగా నటించారు. సముద్ర ఖని కీలక పాత్ర చేశారు. వినోద్ కుమార్ విజయన్, గార్లపాటి రమేశ్ నిర్మించారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రం విడుదల కానుంది. శుక్రవారం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ– ''ఇదొక విభిన్నమైన కథ. అడ్వొకేట్ పాత్రలో సాయిరామ్ శంకర్, పోలీసు పాత్రలో సముద్ర ఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో సాగే క్రైమ్, మిస్టరీ కథనాలతో మా సినిమా ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది'' అని పేర్కొన్నారు.



● సాయిరామ్ శంకర్

ఓటీటీ

ఇది చూడొచ్చు

నాటి రామాయణం నేటి పాత్రలతో.....

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం సింగమ్ ఎగైన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన ఇతిహాసాలలో గొప్ప విలువలతో కూడుకున్న కథ రామాయణం. నాటి రామాయణాన్ని నేటి నేటివిటీతో ప్రస్తుత ప్రముఖ నటీనటులతో మళ్లీ మన ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేశారు బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి. ఇదే ప్రయత్నాన్ని గతంలో చాలా మందే చేసినా యాక్షన్ నేపథ్యంలో వచ్చిన 'సింగమ్' సిరీస్ చిత్రానికి ఈ తరహా ప్రయోగం చేయడం మొదటిసారి. అందులోనూ బాలీవుడ్‌లో భారీ తారాగణంతో ఇలాంటి అంశంతో కూడిన కథ తీయడమనేది నిజంగా సాహసమనే చెప్పాలి. ముందుగా 'సింగమ్' సిరీస్ గురించి చెప్పుకుందాం. ఈ సిరీస్‌లో వచ్చిన మూడో చిత్రం 'సింగమ్ ఎగైన్'. సిరీస్‌లో ఈ భాగం ప్రేక్షకుల ముందు రావడానికి దాదాపు పదేళ్లు పట్టింది. 2011లో 'సింగమ్' మొదటి చిత్రం రాగా 2014లో రెండో భాగంగా 'సింగమ్ రిటర్న్స్' విడుదలైంది. ఆ తరువాత మూడో భాగం 2024లో 'సింగమ్ ఎగైన్'గా వచ్చింది. అన్ని సిరీస్‌లలో కథానాయకుడిగా ప్రముఖ స్టార్ అజయ్ దేవగన్ నటించారు. ఇకపోతే ప్రస్తుత 'సింగమ్ అగైన్' చిత్రంలో అజయ్ దేవగన్‌తో పాటు కరీనా కపూర్, దీపికా పదుకోన్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్ తదితర ప్రముఖ నటులు నటించారు. రామాయణ కథనే ఇతివృత్తంగా అల్లుకున్న కథ ఇది. రామాయణంలోని పాత్రలను రిలేట్ చేస్తూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ స్క్రీన్‌ప్లే కొనసాగుతుంది. ప్రత్యేకంగా చెప్పాలంటే సినిమాలో రామాయణ కథను టీవీ షో రూపంలో చూపిస్తూ కథను నడిపిస్తారు. అప్పటి రామాయణ కథ చరిత్రతో మనకు పరిచయం. అందుకే అది రమణీయ కావ్యం. కానీ ఇప్పటి 'సింగమ్ ఎగైన్' రణరంగమే ప్రధాన సూత్రంగా నడిచిన కథ. ఆఖరుగా ఒక్క మాట... రామాయణ కథను నేటి తరానికి మళ్లీ చెప్పడమనేది మంచిదే కానీ, ఎన్నో భావావేశాలున్న రామాయణ మూల కథలోంచి ఒక్క శౌర్య, వీర రసం మాత్రం తీసుకుని సినిమా రూపొందించడం ఏమాత్రం సమంజసమో సినిమా తీసిన దర్శక–నిర్మాతలు, చూస్తున్న మనలాంటి ప్రేక్షకులు ఆలోచించాల్సిందే. ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా ఈ సినిమా స్ట్రీమ్ అవుతోంది. మీరు కూడా చూసి ఆలోచించడం మొదలు పెట్టండి.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.